## క్లుప్తంగా

### వైభవంగా కామాక్షితాయి కల్యాణం



**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో అమ్మవారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దేవదేవేరులను విశేషంగా అలంకరించి అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఈఓ గిరికృష్ణ పాల్గొన్నారు.

### సైనిక్ స్కూల్ ర్యాంకింగ్‌లో 'ఆదాని'కి రెండో ర్యాంకు



**ముత్తుకూరు:** కేంద్ర రక్షణ శాఖ పరిధిలోని సైనిక్ స్కూల్ సొసైటీ విడుదల చేసిన ర్యాంకుల్లో మండలంలోని గోపాలపురంలోని ఆదాని వరల్డ్ సైనిక్ స్కూల్‌కు రెండో ర్యాంకు లభించినట్లు ప్రిన్సిపల్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. దేశంలో 19 సైనిక్ స్కూల్స్‌కు విలువ ఆధారిత విద్య, దేశ సంస్కృతి, దేశభక్తి, నైపుణ్యం, నాణ్యమైన విద్య, స్వావలంబన, తదితర బహుకోణాలను పరిగణనలోకి తీసుకుని సైనిక్ స్కూల్ సొసైటీ ర్యాంకులను ప్రకటిస్తుందని తెలిపారు. సాయుధ దళాల్లో చేరాలనుకునే విద్యార్థుల సంఖ్యను పెంచడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

### సమాజ సేవకు ఎన్‌ఎస్‌ఎస్ వేదిక




**ముత్తుకూరు:** సమాజ సేవలో పాలు పంచుకోవాలనుకునే యువతకు ఎన్‌ఎస్‌ఎస్ వేదికగా నిలుస్తుందని మత్స్యకళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రమణియన్ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపూడిలో మత్స్యకళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. తొలిరోజు విద్యార్థులు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా గ్రామాలకు సేవ చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథి హాజరయ్యారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ధనపాల్, డాక్టర్ అనుపమ, మెడికల్ ఆఫీసర్ చందన, త్రివేణి, దీప్తి, ఉపసర్పంచ్ గోపాల్ పాల్గొన్నారు.

### మూఢనమ్మకాలను వీడాలి



**మనుబోలు:** మూఢ నమ్మకాలను ప్రజలు వీడాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు అన్నారు. మండలంలోని మడమనూరులో దెయ్యాలు తిరుగుతున్నాయనే వదంతులతో గ్రామస్తులు భయపడుతున్న నేపథ్యంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. జేవీవీ సభ్యులు కళా బృందంతో కలిసి గ్రామంలో పర్యటించి గ్రామస్తుల్లో నెలకొన్న అపోహలను తొలగించారు. దెయ్యం అన్నది కేవలం మన మూఢ నమ్మకం మాత్రమేనని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణారెడ్డి, ఉదయభాస్కర్, సభ్యులు శీనానాయక్, కాలేషా, రఫీ పాల్గొన్నారు.

### వలంటీర్‌కు సేవారత్న పురస్కారం



**మనుబోలు:** మండల కేంద్రమైన మనుబోలులో వలంటీర్‌గా పనిచేస్తున్న తుపాకుల గిరికి సేవా రత్న పురస్కారం లభించింది. గురువారం చెముడుగుంటలో జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. వలంటీర్‌గానే కాకుండా సేవానాథం ట్రస్ట్ సభ్యుడిగా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో గిరికి పురస్కారం లభించింది. అలాగే మండలంలోని ఐదుగురు వలంటీర్లు సేవా రత్న, 205 మంది వలంటీర్లు సేవామిత్ర పురస్కారాలు అందుకున్నారు.

# గడపగడపకూ అభివృద్ధి

- గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజాసమస్యలు గుర్తింపు
- పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు
- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- సర్వేపల్లి నియోజకవర్గంలో రూ.17.30 కోట్లతో పనులు
- ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయించిన మంత్రి కాకాణి






నరుకూరులో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లు



పేడూరులో నూతనంగా నిర్మించిన డ్రైనేజీ

**తోటపల్లిగూడూరు:** ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం సత్ఫలితాలను ఇచ్చింది. గడప గడపకు వెళ్లిన ఎమ్మెల్యేల దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రతి సచివాలయం పరిధిలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, తదితర మౌలిక వసతులను కల్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో సర్వేపల్లి నియోజకవర్గంలో గతేడాది సెప్టెంబర్ 23న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు రెండున్నర నెలల పాటు నియోజకవర్గంలోని 87 గ్రామ సచివాలయాల పరిధిలోని 116 పంచాయతీల్లో మంత్రి పర్యటించారు. ప్రజాసమస్యలను తెలుసుకుని ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

**ప్రాధాన్యతా క్రమంలో పనులు**

గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిసచివాలయానికి రూ.20 లక్షల చొప్పున విడుదల చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, విద్యుత్ లైన్ల నిర్మాణం, తదితర పనులు చేపట్టారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.5 లక్షలతో రెండు సీసీరోడ్లు, మరో రూ.5 లక్షలతో రెండు డ్రెయిన్లు నిర్మించారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని మట్టి రోడ్లను సీసీరోడ్లుగా మార్చారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఏ విధంగా ఖర్చు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందోనన్న విషయాన్ని గ్రామస్తులు, అధికారులతో మంత్రి కాకాణి సమీక్షించి ప్రాధాన్యత మేరకు పనులు చేపట్టడంతో ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నారు.

| సర్వేపల్లికి కేటాయించిన నిధులు | | | |
|---|---|---|---|
| మండలం | సచివాలయాలు | పంచాయతీలు | నిధులు (రూ.కోట్లలో) |
| టీపీగూడూరు | 16 | 22 | 3.20 |
| పొదలకూరు | 21 | 30 | 4.10 |
| ముత్తుకూరు | 16 | 20 | 3.20 |
| మనుబోలు | 14 | 19 | 2.80 |
| వెంకటాచలం | 20 | 25 | 4.00 |
| మొత్తం | 87 | 116 | 17.30 |

### మట్టిరోడ్డు కనబడకుండా సీసీరోడ్లు



గతంలో మట్టిరోడ్లతో వర్షం పడితే ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్డు కన్పించకుండా సీసీరోడ్లు నిర్మించారు. మంత్రి కాకాణి సహకారంతో గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి.

– ఉడా కిశోర్, నరుకూరు పంచాయతీ

### మంత్రి మాట నిలబెట్టుకున్నారు



గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామానికి వచ్చిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి డ్రైనేజీ సమస్యను తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలోని ప్రతివీధిలో డ్రైనేజీలు నిర్మించి ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న మురుగు సమస్యకు పరిష్కారం చూపారు.

–షేక్ బషీర్, పేడూరు పంచాయతీ

### వంద శాతం పనులు పూర్తి



గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో మండలంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. మంత్రి కాకాణి ఆదేశాల మేరకు వంద శాతం పనులు పూర్తి చేయించాం. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనులు చేపట్టాం.

–నారాయణరెడ్డి, ఎంపీడీఓ, తోటపల్లిగూడూరు

### సెబ్ సీఐ బాధ్యతల స్వీకరణ

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐగా యశోదరదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపులపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించినా, అక్రమంగా మద్యం తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### నేడు మంత్రి కాకాణి పర్యటన

**పొదలకూరు :** మండలంలోని తాటిపర్తి పంచాయతీ నల్లపాళెంలో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

### వైభవంగా సరస్వతి పూజ



**పొదలకూరు :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సరస్వతి పూజను వైభవంగా నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులు తమకు పరీక్షల్లో మంచి మార్కులను ప్రసాదించాలని సర్వస్వతీదేవిని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు రూరల్ ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**పొదలకూరు :** నెల్లూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పట్టణంలోని కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఏపీ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు మెంటా వీరబ్రహ్మంగుప్త తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను స్థానిక కన్యకాపమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ త్వరలో యువజన సంఘ కార్యవర్గాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రూరల్ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్యులందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నెల్లూరు రూరల్ అధ్యక్షుడు చెంచయ్య, బ్రహ్మయ్య, సురేష్, సుబ్రహ్మణ్యం, సుధాకర్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

## ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు

**ఇందుకూరుపేట:** ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారులు కిషోర్‌కుమార్, బ్రహ్మేశ్వరనాయుడు సూచించారు. మార్చి 3 నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా మైగ్రేటెడ్, హైరిస్క్ ఏరియాలు అయిన చేపల చెరువులు, ఇటుక బట్టీలు, తదితర ప్రాంతాల్లో శుక్రవారం వారు పర్యటించారు. ఐదేళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులకు పల్స్‌పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26న మండలాధికారులతో పల్స్‌పోలియోపై సమీక్ష సవేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్‌ఎడ్యుకేటర్ సుధాకర్ రావు, సూపర్‌వైజర్లు రమ, సతీష్‌బాబు, ఫార్మాసిస్ట్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ మాధవ్, ఏఎన్ఎంలు కల్పవల్లి, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇటుక బట్టీల వద్ద కూలీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

# ప్రజలతో వలంటీర్లు మమేకం

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

**కొడవలూరు:** వలంటీర్లు సేవలతో ప్రజల్లో మమేకమయ్యారని, వారు లేకపోతే ప్రజలే ఊరుకునే పరిస్థితి లేదని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండలంలోని 262 మంది వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చాక ఠంఛన్‌గా ఒకటో తేదీ లబ్ధిదారుల ఇంటికే వెళ్లి నిద్రలేపి పింఛన్ అందజేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు ఇంటి ముంగిటే అందించేందుకు మన ముఖ్యమంత్రి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టారన్నారు. గ్రామస్థాయిలో పాలన రావాలని గాంధీజీ కలలు కన్నారని, ఆ కలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 33 సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయంటే ఈ రెండు వ్యవస్థలతోనే సాధ్యమైందన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి జగనన్న సేవా పురస్కారాలను అందజేస్తున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ వలంటీర్లను మా నాయకులు మీరేనని అభివర్ణించడం చూస్తే ఆయనకు వలంటీర్ వ్యవస్థపై ఎంతటి గౌరవం, నమ్మకం ఉందో అవగతం చేసుకోవాలన్నారు. జగనన్నను మళ్లీ సీఎంను చేసుకునే అనితర బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు.

**ప్రజలు చెప్పుకునేలా బాబు ఏం చేశారో ఆలోచించండి**

చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో చెప్పుకునేలా ఏం చేశారో ప్రజలే ఆలోచించాలని ఎమ్మెల్యే అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పుకునేందుకు ఎన్నో ఉన్నాయని తెలిపారు. పేదల కష్టాల్లో భాగస్వామి అయ్యే స్వభావం మన ముఖ్యమంత్రి జగన్‌దన్నారు. రెండేళ్ల కరోనా గడ్డు కాలంలో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయంతో కాలం గడిపితే బాబు, పవన్ ఎక్కడున్నారో చెప్పాలన్నారు. ఆ సమయంలోనూ పథకాలు ఆపకుండా ప్రజలకు ధైర్యం చెబుతూ ప్రజల మధ్య వలంటీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉండేలా సీఎం జగన్ చూశారన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్, ఎంపీపీ జీ జ్యోతి, సర్పంచ్ బీ సుప్రియ, జేసీఎస్ కన్వీనర్ కే.శ్రీనివాసులురెడ్డి, నాయకులు మోహనకృష్ణ, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన

**కోవూరు :** రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు అందజేస్తున్న పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు ఆదేశించారు. స్థానిక శాంతి నగర్‌లోని పశువైద్యశాల సమావేశ మందిరంలో కోవూరు సబ్‌డివిజన్ పరిధిలోని రెండు మండలాలకు చెందిన పశువైద్యులు, సహాయకులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా అమలు చేస్తున్న పెయ్య దూడల ఉత్పత్తి పథకంపై రైతులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎదకురాని పశువులను గుర్తించి సమీపంలోని పశువైద్యులను సంప్రదించేలా తగిన చొరవ తీసుకోవాలన్నారు. పశు ఆరోగ్యసురక్ష కార్డులను పాడి రైతులకు పంపిణీ చేయాలన్నారు. 70 శాతం సబ్సిడీపై అందజేస్తున్న పశుగ్రాసం విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమీక్షలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమూర్తి, వైద్యులు ప్రీతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ మహేశ్వరుడు

## ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



టీపీగూడూరు: వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నారాయణరెడ్డి



పొదలకూరులో శిబిరానికి వచ్చిన రోగులకు సూచనలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

**తోటపల్లిగూడూరు:** ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని ఎంపీడీఓ నారాయణరెడ్డి పేర్కొన్నారు. సౌత్‌ఆములూరులోని వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తోందని తెలిపారు. స్పెషలిస్టు వైద్యులు అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని చెప్పారు. ఎవరికైనా శస్త్రచికిత్స అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయిస్తోందని తెలిపారు. ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యులు 418 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైస్‌ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసలునాయుడు, కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్ర, చిన్నపిల్లల వైద్యురాలు సంగీత, జనరల్ ఫిజీషియన్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

**పొదలకూరు :** మండలంలోని ప్రభగిరిపట్నం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో రోగులకు సాధారణ పరీక్షలతో పాటు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

### 26న మండల సర్వసభ్య సమావేశం

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశంలో మండలాభివృద్ధిపై శాఖలవారీగా సమీక్షించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

### ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



మాట్లాడుతున్న ఈఆర్వో ఎం శ్రీనివాసులు

**కోవూరు :** ప్రజాస్వామ్య దేశంలో ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని, ఇప్పటికే ఓటరు నమోదుపై యువతకు అవగాహన కల్పించేలా సదస్సులు నిర్వహించడం జరిగిందని కోవూరు నియోజకవర్గ ఈఆర్వో ఎం శ్రీనివాసులు తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక కుటుంబానికి చెందిన ఓట్లన్ని ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నూతనంగా ప్రచురించిన ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించి అందులో ఏమైనా తప్పొప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయశ్రీ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ జమీర్, మధుసూదన్రావు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఉన్నారు.

## బీఎల్వోలు బాధ్యతగా విధులు నిర్వహించాలి

**కోవూరు :** త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి బీఎల్వోలు వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బీఎల్వోలు, ఎన్నికల సెక్టోరియల్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఈఆర్వో మాట్లాడుతూ ప్రతి సెక్టోరియల్ అధికారి వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించాలన్నారు. ఇంకా ఏమైనా మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటే వెంటనే తమ దష్టికి తీసుకురావాలన్నారు. బీఎల్వోలు కొత్తగా వచ్చిన ఫారం-6 దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పక పాటించాలన్నారు. ఈవీఎంలపై సెక్టోరియల్ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగిఉండాలన్నారు. అనంతరం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ విజయశ్రీ, డీటీ ఇలియాజ్, ఎలక్షన్ డీటీ జమీర్, మధుసూదన్ రావు, ఆర్పీ రమణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఆర్వో శ్రీనివాసులు

### స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్‌హాల్ ఏర్పాటుకు పరిశీలన



**వెంకటాచలం:** ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటుకు కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ), గొలగమూడి లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కళాశాలలను నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట డీఆర్వో లవన్న, తదితరులు ఉన్నారు..

### ఫ్యామిలీ ఫిజీషియన్

**కోవూరు:** కోవూరు-3 సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యులు నిరంజన్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. దీర్ఘకాలిక రోగులకు ఆరోగ్య సూచనలు చేశారు.

### బాల్య వివాహాలపై కళాజాత



**ఇందుకూరుపేట:** గంగపట్నం, మైపాడు, తదితర గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై కళాజాతను శుక్రవారం నిర్వహించారు. ఏసీడీపీఓ రాజలక్ష్మి పర్యవేక్షణలో కళాజాత బృందం బుర్రకథ ద్వారా బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఐసీడీఎస్ పథకాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుడి మంజుల, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

### ముమ్మరంగా పారిశుధ్య పనులు

**విడవలూరు:** స్థానిక దళితవాడ, అబేడ్కర్ నగర్ కాలనీల్లో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు రోడ్లపై పేరుకుపోయిన చెత్త, కాలువల్లోని పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లారు. గ్రామంలో దోమల బెడద ఎక్కువ కావడంతో పారిశుధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి ఉదయ్ తెలిపారు.